24న మెగా లోక్ అదాలత్



నాగరాజు, అల్వాల్ ట్రాఫిక్ సీఐ

అల్వాల్: అల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడిన వారికి ఈనెల 24న ఆదివారం మెగా లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ నాగరాజు తెలిపారు. పట్టుబడిన వారు సంబంధిత పత్రాలతో (ఆధార్, ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్) అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ నాగరాజు కోరారు. పూర్తి వివరాలకు 7337469394, 8143588616.

రైతులకు క్షమాపణ చెప్పాలి



తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్ : రాష్ట్రంలో 40 శాతం మంది రైతన్నలను కుడా రుణమాఫీ కాలేదని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కేటీఆర్ పిలుపు మేరకు మల్లాపూర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి గురువారం పాలాభిషేకం చేసి నిరసన చేపట్టారు. మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయంపై పట్టింపేది?



వాణిజ్య సముదాయాలకు పొందని లైసెన్స్

ప్రతిఏటా పునరుద్ధరణపై నిర్లక్ష్యమే

మున్సిపల్ యంత్రాంగంపై విమర్శల వెల్లువ

సాక్షి, సిటీబ్యూరో: పురపాలక సంఘాల పరిధిలోని ప్రధానరోడ్లతో సహా కాలనీల్లో ఇబ్బడి ముబ్బడిగా వివిధ రకాల వ్యాపార, వాణిజ్య సముదాయాలు వెలుస్తున్నా.. ఆ స్థాయిలో ట్రేడ్ లైసెన్సుల జారీ జరగటం లేదు. సంబంధిత వ్యాపారులు కూడా ట్రేడ్ లైసెన్సులపై శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పన్నుల మదింపులో తేడాలు..

ట్రేడ్ లైసెన్సుల జారీ విషయం అటుంచితే విద్యాసంస్థలు, ఆసుపత్రులు, పరిశ్రమలు, హోటళ్లు, దుకాణాలకు సంబంధించిన పన్నుల మదింపులో తేడాలు కోకొల్లలని తెలుస్తోంది. దీంతో పురపాలక సంఘాలకు ప్రతి ఏటా పెద్ద ఎత్తున రావలసిన ఆదాయానికి భారీగా గండి పడుతోంది. దీనికి ప్రధాన కారణం పురపాలక సంఘాల్లోని కొంతమంది సిబ్బంది నిర్వాకంతో పాటు అవినీతి,అక్రమాలకు తలొగ్గటమేనన్న ఆరోపణలున్నాయి.

ట్రేడ్ లైసెన్సులిలా..

వ్యాపార వాణిజ్య సముదాయాలు, దుకాణాలు నడపాలన్న నిబంధనల ప్రకారం పురపాలక సంఘాలకు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సుకు సంబంధిత వ్యాపారులు తగిన రుసుము చెల్లించి తీసుకోవాల్సి ఉంటుంది. కాగా నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 13 పురపాలక సంఘాల్లో ట్రేడ్ లైసెన్సుల జారీపై ప్రత్యేక బృందాలను నియమించినప్పటికీ లక్ష్యానికి దూరంగానే ఉంటున్నాయి.

రహదారుల ఆధారంగా ..

పురపాలక సంఘాల పరిధిలో వ్యాపారం నిర్వహించుకునేందుకు విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఫీజులు చెల్లించేవారు. కాగా ప్రభుత్వం పురపాలక సంఘాలకు ఆదాయం పెంచే ఉద్దేశంతో జీవో జారీ చేసింది. ఈ జీవో ప్రకారం 20 అడుగుల లోపు ఉన్న రోడ్డును సింగిల్ లైన్, 30 అడుగుల లోపు ఉన్న రోడ్డును డబుల్‌లైన్, 30 అడుగుల కంటే ఎక్కువగా ఉన్న రోడ్డును మల్టిపుల్‌లైన్‌గా విభజించారు. ఆయా రోడ్లకు ఇరువైపులా ఉన్న దుకాణాల విస్తీర్ణాన్ని బట్టి చదరపు అడుగుకు కనిష్ఠంగా రూ.3, గరిష్ఠంగా రూ.7 చెల్లించి లైసెన్స్ తీసుకోవాలని నిబంధన పెట్టారు. దీంతో చాలా మంది దుకాణాల నిర్వాహకులు లైసెన్సులు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. ప్రతి ఏటా ఏప్రిల్‌లో దుకాణాల నిర్వాహకులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సు పునరుద్ధరించుకోవాలని పురపాలక సంఘాల కమిషనర్లు చెబుతున్నా.. ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు.

విలీన పంచాయతీల్లోనూ అంతే...

పురపాలక సంఘాల పరిధిలో విలీన గ్రామ పంచాయతీల్లో పెద్దఎత్తున దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు పెరుగుతూనే ఉన్నాయి. గతంలో ఉన్నవాటికి రెట్టింపు సంఖ్యలో కొత్తగా దుకాణాలు, వాణిజ్య, వ్యాపారసంస్థలు వెలిశాయి. చాలా వాటికి ట్రేడ్ లైసెన్సులు పొందకుండానే వ్యాపార సముదాయాలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు న్నాయి.

- బోడుప్పల్, నిజాంపేట్, జవహర్‌నగర్, దుండిగల్, కొంపెల్లి, నాగారం, పోచారం పురపాలక సంఘాల్లో మొత్తంగా 11,056 వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉన్నట్లు. మున్సిపల్ ఉద్యోగులు గుర్తించినప్పటికీ, ట్రేడ్ లైసెన్సులు మాత్రం 3,998 షాపులకు ఉన్నాయి. ఈసారి పురపాలక సంఘాల్లో మున్సిపల్ అధికారులు గుర్తించిన వాటిలో కూడా 7,058 వ్యాపార సముదాయాలకు ట్రేడ్ లైసెన్సులు జారీ చేయలేదని తెలుస్తోంది. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 2035 వ్యాపార సముదాయాలు ఉండగా.. ట్రేడ్ లైసెన్సులు పొందిన దుకాణాలు 455 మాత్రమే ఉన్నాయి. నిజాంపేట నగర పాలక సంస్థలో 4354కు 2135, జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో 750కి, 282, దుండిగల్ మున్సిపాలిటీలో 1,248కి గానూ 432, కొంపెల్లిలో 1,047కు 256,నాగారంలో 1,211 వ్యాపార సముదాయాలకు 265 ట్రేడ్ లైసెన్సులు, పోచారంలో 411 దుకాణాలకు 173 షాపులకు మాత్రమే ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నాయి.
- పీర్జాదిగూడ, దమ్మాయిగూడ, ఘట్కేసర్, గుండ్లపోచంపల్లి, మేడ్చల్, తూముకుంట పురపాలక సంఘాల్లో ఇదే పరిస్థితి నెలకొందని తెలుస్తోంది. రుణం తీసుకున్న వారు మినహా..
- బ్యాంకులో రుణం తీసుకున్న వారు మినహా మిగతా వ్యాపార సముదాయాలకు సంబంధించిన వారు ట్రేడ్ లైసెన్సులు పొందటానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో పురపాలక సంఘాల ఆదాయానికి భారీగా గండి పడుతోంది.
- జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా పురపాలక సంఘాల్లో మరింత ఆదాయాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. హోటళ్లు, రెస్టారెంట్లు, ఆసుపత్రులు, కిరాణ దుకాణాలు, సెల్ పాయింట్లు, మొబైల్ షోరూంలు, వస్త్ర దుకాణాలు, ఆన్ లైన్ సెంటర్లు తదితర వాణిజ్య సంస్థలు భారీగా పెరిగిపోయాయి. రోజురోజుకూ వ్యాపార, వాణిజ్య సంస్థలు పెరిగిపోతున్నా... చాలామంది నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ పొందడం లేదు. దీంతో పురపాలక సంఘాల ఆదాయానికి రూ. లక్షల్లో గండి పడుతోంది.

మౌలిక వసతుల కల్పనకు కృషి



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్

బోడుప్పల్: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు 12వ డివిజన్ కార్పొరేటర్ బొమ్మక్ కల్యాణ్‌కుమార్ అన్నారు. బోడుప్పల్ అంబేడ్కర్‌నగర్ ఫేస్ – 3లో రూ.40 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్ సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలో ఇప్పటికే 80 శాతం పనులు పూర్తిచేసినట్లు వెల్లడించారు. కాలనీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణచారి, సీనియర్ నాయకులు సుదర్శన్, మురళి, కనకయ్య, రాహుల్, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



ప్రారంభిస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందాలని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 18వ డివిజన్‌లో కీనేటిక్ ఎక్స్‌పర్ట్ ఫిజియోథెరఫీ సెంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్యులు ప్రజలకు సేవాభావంతో వైద్యసేవలు అందించాలన్నారు. 18వ డివిజన్ కార్పొరేటర్ హేమలతాజంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ – బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



హాజరైన ఎంపీ ఈటల, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు



రామంతాపూర్: గణేష్‌నగర్‌లో రాఘవేంద్రస్వామి ఆలయంలో స్వామివారి 353వ ఆరాధన ఉత్సవాలు కనులపండుగగా గురువారం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వల్లపు శ్రీకాంత్ యాదవ్, నామ్ రాజిరెడ్డి, మఠం మేనేజర్ రమేష్, ఉపేందర్‌రెడ్డి, గురు రాజా విజయ్, శ్రీనివాస్ దేశాయి, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరారాధన మహారథోత్సవం..

మల్కాజిగిరి: మల్కాజిగిరి రాఘవేంద్రస్వామి మఠంలో స్వామివారి 353 వ ఆరాధనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.గురువారం ఉత్తరారాధనలో భాగంగా కనకమహాపూజ, విశేష ఫలపంచామృతాభిషేకము, పురవీధుల్లో మహారథోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం సుజ్ఞానేంద్రుల ఆరాధనతో ఉత్సవాలు ముగుస్తాయని మఠం నిర్వాహకులు తెలిపారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, కార్పొరేటర్లు శ్రవణ్, రాజ్యలక్ష్మి, జిల్లా బీజేపీ జిల్లా నాయకుడు బాలచందర్‌గౌడ్‌లు మఠంలో స్వామి బృందావనం దర్శనం చేసుకుని రథోత్సవంలో పాల్గొన్నారు.

చెత్త సేకరణపై ఫిర్యాదు



ఉప కమిషనర్‌ను కలిసిన వెస్ట్‌దీన్‌దయాళ్‌నగర్ అసోషియేషన్ ప్రతినిధులు

మల్కాజిగిరి: వెస్ట్ దీన్‌దయాళ్‌నగర్‌లో చెత్త సేకరణ సరిగ్గా జరగడంలేదని అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు డీసీకి ఫిర్యాదు చేశారు. కాలనీ అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ నుంచి చెత్తసేకరణ ఆటో ట్రాలీ నిర్వాహకులు వ్యర్థాలను సేకరించడం లేదని పలుసార్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు దృష్టికి తీసుకొని వచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. వర్షాకాలం కారణంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, వేరే వ్యక్తులకు పనిని అప్పగించాలని కోరారు. గౌరీశంకర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



జలమండలి అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్‌పరిధిలోని సామల లక్ష్మీనగర్‌కాలనీ, కౌకూర్ ఎంబీ దర్గాలో నీటి సమస్య, డ్రైనేజీ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ.. గురువారం సైనిక్‌పురిలోని జలమండలి కార్యాలయంలో జలమండలి డీజీఎం రాజు, జీఎం మల్లికార్జున్‌కు కాలనీవాసులు కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన అధికారులు సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. లక్ష్మణ్‌యాదవ్, రాజు, లక్ష్మి, పుష్ప, సైనాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌బీవీఆర్‌ఆర్ జయంతి వేడుకలు

కాప్రా: కొత్వాల్ రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి జయంతి వేడుకలు ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీరెడ్డి ఆధ్వర్యంలో రాధిక చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొత్త అంజిరెడ్డి, పైళ్ల హరినాథ్‌రెడ్డి, నీలం రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, మల్లారెడ్డి, రాజిరెడ్డి, పెంటారెడ్డి, తునికి మహిపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, ఆనంద్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సీతారాంరెడ్డి, తీగల సత్తిరెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న స్థానిక నేతలు

వాహనాల తనిఖీలు

నంబరు ప్లేట్లు మారిస్తే భారీ జరిమానా..



ఉప్పల్ రింగ్ రోడ్డులో తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసరావు, సిబ్బంది

ఉప్పల్: వాహనదారులు చలాన్లను తప్పించుకోవడానికి నంబర్ ప్లేట్లను ఇష్టానుసారంగా మార్చుకుంటే భారీగా చలాన్లను విధిస్తామని మల్కాజిగిరి ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద ప్రత్యేకంగా నంబర్ ప్లేట్లపై ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాదవితో కలిసి డ్రైవ్ నిర్వహించారు. నంబర్ ప్లేట్లు సరిగ్గా లేని వాహనాలకు జరిమానా విధించారు. ఏసీపీ మాట్లాడుతూ.. ఆర్టీఏ నిబంధనల ప్రకారమే వాహనాలకు నంబర్ ప్లేట్లను బిగించుకోవాలని, లేదంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ఇస్తే తల్లిదండ్రులదే బాధ్యత అని గుర్తు చేశారు. 93 ద్విచక్ర వాహనాలు, 5 కార్ల యజమానులకు, రెండు ఆటోలకు చలాన్లు విధించినట్లు పోలీసులు వివరించారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలో హిల్‌టాప్ కాలనీలో శ్రీ రేణుకాఎల్లమ్మ, పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా జరిగాయి. గురువారం ఆలయంలో సర్వదేవతల పూజలు, హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. టీటీడీ తెలంగాణ పాలక మండలి సభ్యులు రమణారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మల్లారెడ్డి, క్రిష్ణారెడ్డి, ప్రేమ్‌కుమార్, అంజయ్య, నాగరాజు, యాదగిరి, సాయి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌ను పట్టించుకోండి !



మురుగుతో బస్టాండ్ ఇలా..

రామంతాపూర్: టీవీ స్టూడియో పక్కన ఉప్పల్ వైపు వెళ్లే బస్టాండ్‌లో మురుగు నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. బస్టాండ్ పక్కనే ఉన్న రూ. 5 భోజనం చేసే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి మురుగును తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ ధర్నా



ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

అల్వాల్: నగరంలోని అసెంబ్లీ గన్‌పార్కు, ఈడీ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విలీన గ్రామాల సమస్యలపై మంత్రులకు వినతి

ఘట్‌కేసర్: అవుషాపూర్, అంకుషాపూర్, మాదారం గ్రామాలను యాదాద్రిలో కలుపొద్దని కోరుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, రోడ్డు రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారి కార్యాలయంలో గురువారం కలిసిన జేఏసీ నాయకులు వినతి పత్రాలను సమర్పించారు. తమ విజ్ఞప్తిపై మంత్రులు సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నేతలు మశ్చేందర్‌రెడ్డి, కరుణాకర్, వెంకట్‌రెడ్డి, మహేశ్, సల్మాన్ వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు నిర్వహణపై మార్పులు జరగాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: ఆదర్శ్‌నగర్ వద్ద ఉన్న డంపింగ్ యార్డు నిర్వహణలో తక్షణమే మార్పులు జరగాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. వారం రోజుల్లో ఈ పని పూర్తిచేయాలని సూచించారు. గురువారం ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంటింటికి చెత్త సేకరించే స్వచ్ఛ ఆటోల సంఖ్యను పెంచాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. డంపింగ్ యార్డు మెకానిజంను అన్ని విధాలుగా ఆధునీకరించి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని రాంకీ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుందొరెడ్డి, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ లావణ్య, రాంకీ సంస్థ ప్రతినిధులు, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్‌ఎస్ నాయకులు కాసం మహిపాల్ రెడ్డి, బైరీ నవీన్‌గౌడ్, సీసీఎస్ ప్రతినిధులు ఎంపల్లి పద్మారెడ్డి, నాయకులు కుమారస్వామి, గంప కృష్ణ, ఎస్‌ఏ రహీం, అనిల్, వినోద్, నవీన్, నర్సింహవంశరాజ్, స్వచ్ఛ ఆటో నిర్వాహకులు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడను అభివృద్ధి చేస్తా

మల్లాపూర్: మల్లాపూర్ పారిశ్రామికవాడ అభివృద్ధికి కృషి చేస్తానని మల్లాపూర్ ఐలా చైర్మన్ డాక్టర్ ఎస్ఆర్. శ్రీనివాస్ అన్నారు. ఐలా కార్యాలయంలో మల్లాపూర్ నోటిఫైడ్ మున్సిపల్ ఇండస్ట్రీయల్ ఏరియా సర్వీస్ సొసైటీ పాలకవర్గం 18వ వార్షిక పాలక సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గతేడాది చేసిన అభివృద్ధిపై చర్చించారు. రూ.8 కోట్లతో సీఎస్ఆర్ ఫండ్ కింద ఆరినా లైఫ్‌సైన్స్ సహకారంతో మల్లాపూర్, నాచారం వెళ్లే నాలాపై వంతెన నిర్మాణం రూ.70 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. అనంతరం నూతన పాలకవర్గం చేత కమిషనర్ ప్రభాకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. మల్లాపూర్ పారిశ్రామికవాడలో రూ.10కోట్లతో రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేపడతామని చైర్మన్ వివరించారు. వైస్ చైర్మన్ హుస్సేనయ్య, కార్యదర్శి భూషణ్‌రావు, సంయుక్త కార్యదర్శి ఎల్‌వీఆర్. శాస్త్రి, కోశాధికారి సంజీవ్‌కుమార్, మేనేజింగ్ కమిటీ సభ్యులు, పారిశ్రామిక వేత్తలు మోహన్‌రెడ్డి, పీఎస్ నాయుడు, మహేందర్‌రెడ్డి, కిషన్‌చంద్ర, కామేశ్వర్‌రావు, ప్రదీప్, రోహిత్ మిథల్, నాచారం ఉప్పల్, చర్లపల్లికి చెందిన పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు భరోసా

ఆదర్శంగా నిలుస్తున్న ఉత్తమ్‌నగర్ కాలనీవాసులు



ఉత్తమ్‌నగర్‌లో వివేకానంద పాఠశాల



విద్యార్థులకోసం కంప్యూటర్ శిక్షణ గది

గౌతంనగర్: సమిష్టి నిర్ణయాలతో పనిచేస్తే కాలనీ కూడా ప్రగతిపథంలో పయనిస్తాయి. 1974లో సుమారు 4.5 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 130 ప్లాట్లతో రైల్వేలు, మిలటరీలో పనిచేసే ఉద్యోగులంతా కలిసి కాలనీని ఏర్పాటు చేసుకున్నారు. కాలనీకి ఉత్తమ్‌నగర్ కాలనీ అని పేరు పెట్టుకున్నారు. మొదటి ఎస్ఏనాల్ వ్యవస్థాపక అధ్యక్షులుగా ఉత్తమ్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం సుమారు రూ. 45 లక్షలతో కాలనీ కమ్యూనిటీ హాల్ భవనాన్ని నిర్మించుకున్నారు.

లాభాపేక్ష లేకుండా భరోసా..

స్థానిక కమ్యూనిటీహాల్ భవనంలో 1984 నుంచి వివేకానంద ప్రాథమికోన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి పాఠశాలను విజయవంతంగా నడిపిస్తున్నారు. ప్రస్తుతం 200 వందల మంది విద్యార్థులు, 14 మంది సిబ్బంది ఉన్నారు. మూడేళ్ల క్రితం హైస్కూల్‌గా రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపుతో అనుమతులు లభించాయి. స్థానిక లయన్స్ క్లబ్ ప్రతినిధులు దత్తత తీసుకుని ప్రతిఏటా విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులు అందజేస్తున్నారు. దాతల సహకారంతో పాఠశాల ప్రాంగణంలో నీటిశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇతర కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా డిజిటల్ తరగతులు, కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు బోధన చేపిస్తున్నారు. పాఠశాల కమిటీ సభ్యులుగా కే. రాఘవేంద్రరావు, బెనర్జీ, సాయిబాబాగౌడ్, ప్రధాన ఆచార్యులుగా సుధ వ్యవహరిస్తున్నారు.

కంప్యూటర్ శిక్షణకు విరాళం..

వివేకానంద పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ తరగతులలో శిక్షణ ఇవ్వడానికి తనవంతు సాయంగా పాఠశాల కమిటీ సభ్యులు సాయిబాబాగౌడ్ కుమార్తె డాక్టర్ సుస్మిత గురువారం రూ. 20 వేలతో కంప్యూటర్ యూపీఎస్, రెండు డెస్క్‌టాప్‌లను కొనుగోలు చేసి పాఠశాలకు విరాళంగా ఇచ్చారు.

అదనపు తరగతి గదుల పనులు ప్రారంభం

ఘట్‌కేసర్: ఎదులాబాద్ ఉన్నత పాఠశాలలో రూ. 50 లక్షలతో నిర్మిస్తున్న అదనపు తరగతి పనులు టీ పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నియోజకవర్గానికి రూ. 10 కోట్లు విడుదల చేయగా స్కూల్‌కు రూ. 50 లక్షలు కేటాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు.

ముంపు ప్రాంతాలపై ముందస్తు చర్యలు



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: నగరంలోని ప్రధాన కార్యాలయంలో జరిగిన స్టాడింగ్ కమిటీ సమావేశానికి అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి ఇతర సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అల్వాల్ డివిజన్‌లోని సత్తమ్మనగర్, మల్లారెడ్డి కాలనీలు ముంపునకు గురౌతున్నాయని ముంపునకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వెస్ట్ వెంకటాపురంలో బాక్స్ డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ.. మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం అందజేశామని కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అల్వాల్ డివిజన్‌లోని రెండు చెరువుల గురించి చర్చించి వాటి సుందరీకరణ, అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు.


ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ భూమిపూజలో పాల్గొన్న కొత్త కిశోర్‌గౌడ్

బోడుప్పల్: లక్ష్మారెడ్డికాలనీలో పోచమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ముఖ్యఅతిథిగా కాంగ్రెస్‌పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ–బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో అమ్మవారి దేవాలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తామన్నారు. లక్ష్మారెడ్డి కాలనీ అధ్యక్షులు శివకుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రుకుమ్‌కుమార్, కోశాధికారి సుధాకర్ కుమార్, ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, సలహాదారులు నాగేశ్వర్‌రావు, కమిటీ సభ్యులు లక్ష్మి, అనసూయ, వెంకటేశ్వరరావు, మధు, సతీష్‌శర్మ, కాలనీవాసులు పాల్గొన్నారు.

వాణిజ్య సముదాయాల్లో తనిఖీలు



జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ వాణిజ్య సముదాయాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడుతున్నారన్న సమాచారంతో గురువారం పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు ఆదేశాల మేరకు ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ బాలమురళి తమ సిబ్బందితో నగర పాలకసంస్థలో పలు వాణిజ్య సముదాయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని యజమానులకు రూ.4 వేల మేర జరిమానా విధించారు. ప్లాస్టిక్‌పై ఉన్న నిషేధాన్ని గుర్తించి ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడడంలో ప్రతి ఒక్కరూ..సహకరించాలని కోరారు. సింగిల్ యూజ్‌ప్లాస్టిక్ ఉపయోగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పీఆర్టీయూఎస్ అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి

మేడ్చల్: మేడ్చల్ మండల పీఆర్టీయూఎస్ సంఘం అధ్యక్షుడిగా ఆర్.మధుసూదన్‌రెడ్డి ఎన్నికయ్యారు. మేడ్చల్‌లో నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి 8వ సారి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా రజిత, అసోసియేట్ అధ్యక్షుడిగా తవిటి నాయుడు, ఉపాధ్యక్షుడిగా హరీష్, లతాశ్రీ, మహిళా కార్యదర్శిగా వెంకటరత్నం, కార్యదర్శులుగా టి.హరీష్, జగదీష్ ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.